షేక్స్పియరు కథ :

రోమియో ★ జూలియట్

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

వెరోనోలోని ముఖ్య కుటుంబాలు కేప్యులెట్లు - మంటాగోలు. ఆ కుటుంబాలు రెంటికిని చిరకాలమునుండి వైరమే. వీరిమధ్య ఎప్పుడూ ఏదో ఒక తీవ్రమైన కలహాలు జరుగుతూనే వుండేవి. వట్టి ఘర్షణలే కాకుండా చీటికి మాటికి చెయ్యికూడా చేసుకొనేవారే. ఆఖరుకి ఆ కుటుంబాల నౌకరులు సహితము ఏ బజారులోనో, రోడుమీదో ఎదురైతే సంఘర్షణేదో ఒకటి జరుగకుండా వుండేది గాదు.

ఒకరోజు కేపులెట్టు పెద్దయజమాని ఒక పెద్ద విందు చేశారు. ఆ విందుకు అనేకమైన ప్రభువులను చక్కని స్త్రీలను ఆహ్వానించిరి. దేశములోని సుందరాంగులందరినీ విందులో చూడవచ్చును. మంటేగో కుటుంబములోని వారు తక్క మిగిలిన వారందరు ఆహ్వానింపబడిరి, విందుకు వచ్చేవారందరినీ బ్రహ్మాండముగా ఇంటిలోనికి ఆహ్వానిస్తూ వారిహోదాలకు తగినట్లు ఆసీనులను చేయుచుండిరి. ఈ విందుకు రోజలైనుకూడ ఆహ్వానింపబడెను. మంటెగో కుమారుడైన రోమియోకు రోజలైను ప్రియురాలు. రోమియో మిత్రుడు బినోనోనియో అనువాడు. ఈవిందుకు ఎట్లయినను మారువేషము వేసుకొనైనను తన మిత్రుని వెళ్ళమని బలపరచెను — కారణము ఇచ్చట దేశములోని అందకత్తెలనందరినీ చూచిన పిదప తన ప్రియురాలు రోజలైన అందచందాల వివరములతో తన చెవులు చిల్లులు పడునట్లు విసుకించుట మానుకొనుననియే. రోజలైను తనను ప్రేమించకపోయినను రోమియోకు ఆమె దేదీప్యమానమైన దేవకన్యకగా కనపడుచుండుటచే సర్వకాల సర్వావస్థల యందు రోజలైను అందచందాల వివరాలతో విసుగించుచుండెను. చిట్టచివరకు విందుకు వెళ్ళుటకు సమ్మతించి తన మిత్రుడు బొనవిలో ఇంకొక మిత్రుడూ మెరిక్యూషియోలతో కలసి మాస్కుధరించివెళ్ళెను. అప్పటి కాలములో అప్పుడప్పుడు మాస్కుధరించి విందుకు వెళ్ళుట పరిపాటే, వీరిని అందరితోపాటు పెద్ద కాపులెట్ ప్రభువు ఆదరించి ఆసీనులను చేసి అక్కడ జరుగుచున్న నాట్యములలో పాల్గొనమని చెప్పెను. ఆ నాట్యము చేయువారిలో ఒక సుందరాంగి అద్భుత సౌందర్యము రోమియోను దిగ్భ్రాంతి చేసెను. మైమరచి 'ఆహా! ఏమి సౌందర్య'మని గట్టిగా అనెను. ప్రభువు కాపులెట్ మేనల్లుడు టైబాల్టు అనువాడు ఈ మాటలు విని శబ్దముచే రోమియోను గుర్తించెను. మంటేగో కుటుంబీకుడు తమ ఇంటి విందులకు వచ్చుట సహింపదయ్యె. పరిహాసము చేయుటకే తమ యింటికి వచ్చెనని తలచి రోమియోపై చెయ్యి చేసుకొన వుద్యుక్తుడాయెను. కాని విందు సమయమందు రభస చేసిన తన మేనమామ కోపగించునేమోయని అతి కష్టముతో మానుకొనెను.

రోమియో అతిచతురతతో ఆసుందరాంగితో మాట్లాడు అవకాశము కలిగించుకొనెను. సంభాషణా చాతుర్యముతో ఆమెను నిలపి సంభాషించుచుండగా ఆమె తల్లి పిలచుటచే రోమియోను విడచి ఆమె వెళ్ళవలసివచ్చెను. ఆపిలచినది క్యాపులెట్ సతి అనియు, తన హృదయ మనోహారి, సుందరాంగి, వారి ప్రియపుత్రిక జూలియట్ అనియు తెలసికొని తాను చాల బాధపడెను. కాని గట్టిగా హృదయములో హత్తుకొనిపోయిన ఆ సుందర స్వరూపాన్ని తుడచివేయలేకపోయినాడు. బాధపడుతూనే ఆమెను ప్రేమింప మొదలిడినాడు. అట్లే జూలియట్‌నూ రోమియో ముఖమైన చూడకుండగనే ఆతనిని ఏలనో గాఢముగా ప్రేమింపమొదలిడెను.

అప్పటికే అర్థరాత్రి సమయమగుటచే రోమియో తన మిత్రులతో సహా ఇంటికి బయలుదేరిరి. కాని బైట కాలు పెట్టగనే తన సామ్మేదో ఇంట్లో విడచివచ్చినట్లు తోచి రోమియో తన మిత్రులకు తెలియకుండ ప్రహరి గోడదూకి కోశయోలెటు గృహావరణలోనికి ప్రవేసించెను. అచట జూలియట్ సౌందర్యమును గురించి ఆలోచించుచుండగనే ఒక కిటికీలోనుండి జూలియట్ సుందర విగ్రహము కనబడెను. చంద్రబింబముకన్నను ఆమె ఎన్నియోరెట్లు ఎక్కువ ప్రకాశవంతముగా కనబడెను. ఆమెను చూచుచు అట్లే నిలబడిపోయెను. ఇంతలో ఆమె ఒక దీర్ఘనిట్టూర్పు

విడమును "అయ్యో - నేను" అనెను. ఆహా 'ఏమి సుందరీ - నా దేవకన్య - ఏమిటి చెప్పు నీ మనస్సులోని మాటయని' మెల్లగా రోమియో తనలో తాననుకొనెను. ఇంతలో ఆమె రోమియో అచటనున్నాడని తెలియక 'ఓ రోమియో, ఓ రోమియో నీవెందుకు రోమియో వైతివి ? నాకొరకు నీ పేరువిడచి నా ప్రియునివి కావేని నేను ఈక్షణము నుండి కాపులటు వంశీయురాలను కాజాలను" అనెను. ఈమాటలు వినుటతోనే జూలియటు కూడ తనను ప్రేమించుచున్నదని తెలసికొని అపరిమిత ఆనంద సముద్రమున మునిగిపోయెను. జూలియట్ తనలో తానే గట్టిగా రోమియో, మెంటేగో కుటుంబీకుడే లాయెనో, తనకు తన ప్రియునకు ఆకుటుంబ కక్షల వలన ఎట్టికీడు మూడుకోయని విధినిదూరెను ఇట్లామె తనప్రేమ విరహ విలాపకలాపములు గట్టిగా సాగించుచుండగా రోమియో వీనులు విందుతో హృదయానంద భరితుడగు చుండెను. మెల్లిగా కిటికీ వద్దకు వచ్చి ఆమె కనబడకుండ ఆమెను ఇట్లు వేడుకొనెను. 'నీకే పేరుతో నాపేరు పిలచిన ఆనందమో ఆపేరుతోనే నన్ను పిలువుము. నీవే పేరుతో పిలచినను సరే - నేను ప్రస్తుతము రోమియోను కాదు నీప్రియుడను కావున నీయిచ్ఛవచ్చిన పేరుతో పిలువుము' అనెను. ఈమాటలు, పురుషకంఠము తనకిటికీ వద్దవినగనే జూలియట్కు అపరిమితమైన భయము కలిగెను. 'నీవిచటకేలవచ్చితివి. ఎవరు వెళ్ళమనిరి ? ఇచ్చట ఎవరైన నిన్ను చూచితిరేని నీకు మరణము తప్పదు' అని మెల్లిగా అనెను. 'ప్రేమే నాకీవిధానము చూపినది. నిన్ను ప్రేమించి మరణించుటే మేలని' రోమియో అనెను. దానిలో ఆమె భయపడుచూనే రోమియోమీద తనకు కలిగిన ప్రేమను తెలపెను. రోమియో తనివి తీర ఆమాటలు వినుచుండగనే గంటలు క్షణములవలె గడచిపోయెను. తూర్పున చీకట్లు తొలగుచుండెను. తెల్లవారుచున్నదని తెలసికొని చాల భయపడి చిట్టచివరకు రోమియో జూలియటును వదలివెళ్ళెను. తెల్లవారగనే అతనికి ఎచ్చటకు రావలసినది కబురు బంపెదనని అనిర్ణీత స్థలములో కలసికొని వివాహము చేసికొని తరువాత తన నాధునితో పాటు ఆవిశాల ప్రపంచములో ఎచ్చటకయిన బయలుదేరి వెళ్ళవచ్చునని యామె చెప్పెను.

రోమియో అప్పటికైన ఇంటికి మరలి విశ్రాంతి తీసుకొనక తన మిత్రుడు ఫ్రైయరు లారెన్సు యుండు ఆశ్రమమునకు వెళ్ళెను ఇంత తెల్లవారుతూనే రోమియోను చూచి ఆమతగురువు ప్రేమ బాధతో నిద్రపోలేదు కాబోలునని తలచెను. కాని రోమియో తన క్రొత్త రాధదేవత జూలియటు సంగతి చెప్పి ఆనాడే తనకు ఆమెకు వివాహము చేయు ఏర్పాట్లు చేయుమని అనేక విధముల ప్రార్థించెను. నిన్నటివరకూ రోజలేను అందాన్ని శ్లాఘించిన చిన్నవాడు నేడు జూలియట్ సౌందర్యాలాలసుడగుట ఆశ్చర్యము కలిగించి హృదయాల్లోగాక యువకులకు కండ్లలో ప్రేమ అవతరించునుగదాయని ఆలోచించ సాగాడు. కాని రోమియో తన వివాహ ఏర్పాటు చేస్తానని ఒప్పుకునే వరకు ఆయనను వదలలేదు.

జూలియటు పంపిన వార్తాహరుడు రాగానే తన ఏర్పాట్లను ఆమెకు తెలియచేసి లారెన్సు సహాయముతో ఆయన ఎదుటవారికి న్యాయబద్ధముగ వివాహము జరిపెను వెంటనే జూలియట్ తన ఇంటికి వెళ్ళెను. రోమియో తిరిగి ఆరాత్రికి తన కిటికీ దగ్గరకు వచ్చెదనని వాగ్దానము చేసెను. ఆదినము మధ్యాహ్నము రోమియో స్నేహితులు బెన్వోలియోను మర్క్యూషియోను రాజమార్గమున వెళ్ళుచుండగా టైబాల్టువారిని చూచి రాత్రి కోపమింకను ఉపశమింపకుండుటచే వారిపై చెయ్యిచేసుకొనెను. ఇంతలోకే అచ్చటకు రోమియోకూడ వచ్చెను. మర్క్యూషియోకు బలమైన గాయము తగిలెను రోమియో తన మిత్రుని చంపినందులకు కినసి టైబాల్టును చంపెను.

వెంటనే న్యాయస్థానమందు న్యాయ విచారణ జరిగెను. వెంటనే రోమియో వెరోనో నగరము విడచి వెళ్ళవలసినదిగా తీర్పు చెప్పబడెను.

కొద్ది గంటలమాత్రమే మధురమైన వాతావరణంలో యున్న ఆవధువు జూలియట్ ఈ విషాదవార్త విని చాల ఖేదపడెను. రోమియో ఈ సంఘటన తరువాత లారెన్సు ఆశ్రమము చేరి అచ్చట పిచ్చివానివలె ప్రేలుచుండెను. తాను విరోనా పట్టణము విడచి ఎట్లు వెళ్ళుదునని తల పీకుకొనుచు అరచుచుండెను. అప్పుడు ఆమతగురువు తన మిత్రుని మీద అధికమైన జాలితో కర్మ సిద్ధాంతమును

తెలియపర్చుమ ఓదార్చ జూచెను. కాని రోమియో వేదాంతపాఠములు విను స్థితిలో లేడు. ఇంతలో జూలియటు వద్దనుండి కబురు వచ్చెను. అదృష్టవశాత్తు టైబోల్టు చనిపోయెను. కాని ఆముల్ల యుద్ధములో నీవే చనిపోయి యుండెడివాడివే. పైగా న్యాయమూర్తులును నీమీద ఎక్కువ కఠినమైన శిక్ష బదులు నీకు దేశాంతర వాస శిక్షమాత్రమే కదా విధించిరి. రాత్రికి వెళ్ళి జూలియట్‌ను కలుసుకొని ఆమెకు వీడ్కోలు చెప్పి, తెల్లవారక మునుపే వెరోనా పట్టణము వదలి మంటోవా నగరమునకు వెళ్ళి అక్కడ నివసించుచుండుము. సమయము వచ్చినపుడు మీ వివాహ విషయము ఎల్లరకు తెలియ చేసెదను. అప్పుడు మీ ఇద్దరి తల్లిదండ్రుల వంశములలోని కలతలు తగ్గించుకొని మీకు సుఖము తప్పక కలిగింతురు! అని రోమియోకు సలహా ఇచ్చెను. రోమియో అట్లేననెను. జూలియటు వద్దనుండి వర్తమానములు జాబులు ఎప్పటి కప్పుడు తనకు పంపెదనని లారెన్సు వద్ద వాగ్దానముగైకొనెను.

ఆరాత్రి రోమియో క్రిందటి రేయి వలెనే ప్రహరీ దూకిలోని ఆవరణలోనికి వెళ్ళెను. తన భార్య జూలియటు కిటికీ వద్దలేదు. కాని మరగున వున్న ద్వారము నొకదానిని తెరచి తన భర్తను లోనికి పిలుచుకొని పోయెను. రాత్రంతయు కంటికి కూరుకు లేక ప్రేమ పాశములు వల్లెవేసుకొనిరి. కొద్ది క్షణములలోనే రేయెల్ల కడచిపోయినట్లుండెను. కాకులు కూయనారంభించెను. తెల్లవారు చున్నదను తెలివితో దుఃఖరేఖలు ఇద్దరి మొఖమున పొడసూపెను. భారమైన దుఃఖముతో హృదయావేదనతో రోమియో తన ప్రేయసిని విడచి వెళ్ళెను. త్వరత్వరగా వెరోనా పట్టణముకూడా విడచి వెళ్ళెను.

ఈ ప్రపంచములో కొందరి జీవితములు సుఖమయము. కొందరి జీవితములు దుఃఖమయము. ఏక్షణమున ఈజంట కన్నులు మనసులు కలసినవో ఆవేళావిశేషమేమో వారికి అప్పటినుండే శాంతిలేదుకదా అన్ని విషాదచ్ఛాయలే!

ఈవిషాద సంఘటన తరువాత కొన్నిదినములకు జూలియటు తండ్రి ఆమె వివాహమును పేరిసు ప్రభువుతో నిర్ణయించెను. ఈవిషయము తెలిసికొని భయపడి పరిపరి వినయముల తండ్రిని ప్రాధేయపడి తనకిష్టములేని వివాహము వలదనియు మరి ఆ లేక ఇతర కారణములు చెప్పియు, ఆ వివాహ ప్రయత్నము తప్పించ చూచెను. కాని ఆమె తండ్రి అవన్నియు స్త్రీ సహజపు సిగ్గుసిరులని భ్రమపడి వివాహ ప్రయత్నమునకు వలయు అన్ని ఏర్పాట్లను చేయుటకు సన్నిద్ధుడాయెను.

ఇంక చేయునది లేక జూలియటు తన విశ్వాస పాత్రుడైన ధర్మస్నేహితుడగు లారెన్సును సలహానడిగెను.

ఆవేదాంతి జూలియటును ఇంటికి వెళ్ళి పేరిసు ప్రభువును వివాహము చేసుకొనుటకు సమ్మతించుమనెను. అట్లు చేయుటకన్న మరణమే శరణ్యమనెను. అప్పుడు ఆ మతగురువు చిరునవ్వు నవ్వి - పోయి తాను చెప్పిన ప్రకారము పారిసు ప్రభువును వివాహము చేసుకొనుటకు నప్పుకొనమనెను. ఆమె చేతిలో ఒక చిన్న సీసానిచ్చి దానిని ఆరాత్రికి తీసుకొనమనెను. అది తీసుకొనిన మరణించినట్లు పడిపోవుదురనియు, మర్నాడు వివాహ సమయమునకు పెండ్లికుమారుడు కళ్యాణ గృహమునకు వచ్చునప్పటికి తాను మరణించినట్లు పడియుండుననియు అప్పుడు తనని ఆదేశ ఆచార ప్రకారము పాడె మీద శ్మశాన వాటికకు తీసుకొని వత్తురనియు తన దేహము తెచ్చినవారు వెళ్ళిపోయిన పిదప అనగా సరిగా ఔషధము సేవించిన 42 గంటలకు తెలివి వచ్చుననియు అప్పటికి రోమియో అచ్చటికి వచ్చునట్లు చేయుదుననియు తరువాత ఇద్దరు తమ ఇచ్చవచ్చిన చోటకు వెళ్ళి సుఖముగా నుండవచ్చుననియు చెప్పెను. ఈ వుపాయము చాల బాగున్నదని తలచినను కొద్దిగా భయపడినది. కాని పేరిసు ప్రభువును వివాహమాడకుండ తప్పించుకొనుటకు రోమియోను చేరుటకు వేరొక ఉపాయము తోచక ఇదియే గతియని తలచి ఆయన వద్ద ఆ సీసా తీసికొని ఆయన చెప్పిన ప్రకారమే చేసెదనని చెప్పి ఇంటికి వెళ్ళెను.

మార్గ మధ్యముననే పేరిసు ప్రభువును కలుసుకొనెను. ఆయనను వివాహమాడుటకు అంగీకారము తెలిపెను. వెంటనే వాయువేగముతో ఆయన వెళ్ళి ముసలి క్యాపులెటు దంపతులకు తెలిపెను. వారు మిక్కిలి అలజడితో వివాహ సన్నాహము ఏర్పాట్లు మరింత ఉత్సాహముతో

చేతుల మీదిగా మహా వైభవముగ జరుగవలసిన వివాహమునకు వలయునన్ని ఏర్పాట్లు మహా వేగముగా, ఆడంబరముగా జరుగుచుండెను.

ఆదినము బుధవారము. సూర్యాస్తమయమగుచున్నది. ఇంతలోనే జూలియటు మనసులో పెద్ద ఆందోళనతుపాను చెలరేగినది. తను ఆమందు త్రాగిన నిజముగా మరణించితే తన ప్రియుడైన రోమియో గతి ఏమగునో లేక నలుబది నాల్గు గంటలకు పూర్వమే తనకు తెలివివచ్చిన. అప్పటికి రోమియో రానియెడల తానేమి చేయవలెను. తనని శ్మశాన భూమిలో వదలి వెళ్ళినప్పుడు పిశాచములు వగ్గెరాలు పట్టుకొని హింసించితే? ఇట్లా అనేకవిధముల ఆలోచించుచూ దుఃఖించుచూ, విధిని దూరుతూ తన అదృష్టమెట్లున్నదోయని ఆలోచించెను. దిక్కు తోచలేదు. ఆ ఔషధము సేవించుటే తరుణోపాయమని ఔషధము త్రాగి పడక మీద వ్రాలెను. తెలివి తప్పెను.

గురువారముదయము మేళతాళాలతో మంగళ వాద్యములతో పెండ్లికొడుకు వేషమునే జూలియటు గృహమునకు వచ్చెను. అనిర్జీవ జూలియటు ప్రతిమను చూచి పేరిసు ప్రభువు నిర్జీవుడాయెను. ఆమెకై విలపించెను. తన దురదృష్టమును తిట్టుకొనెను. వివాహమునకు కావలసిన పురోహితుని బదులు అంత్యక్రియలకొరకు పురోహితుని పిలిపింపవలసివచ్చెను. ఇంటిలో వివాహమునకు చేయు ఏర్పాట్లన్నియు అంత్యక్రియలకు మరలింపవలసివచ్చెను.

శుభవార్తలకన్న దుఃఖవార్తలు శీఘ్రముగా చేరును కదా! ఫ్రెయరు లారెన్సు బంపిన వార్త చేరకముందే రోమియోకు జూలియటు మరణవార్త తెలిసెను. ఆహా ఏమి సృష్టివైపరీత్యము. తానొకటి తలచిన దైవమింకొకటి తలచునుగదా జూలియటు మరణ వార్త వినగనే ఒక రహస్య స్థలమునకు పోయి కొద్దిగా ఒక చిట్కా విషమును కొని దానిని భద్రముగా దాచికొని వెరోనాకు బయలుదేరెను. అచ్చట చివరిసారి తన భార్యయగు కళేబరమునైన చూచి ఆ విషమును రోమియో నచ్చటనే సేవింపదలచెను. తాను వెంటనే బయలుదేరెను గనుక లారెన్సు బంపిన వార్త తనకు అందనేలేదు. రోమియో శ్మశానమునకు చేరునప్పటికి అచట పేరిసు ప్రభువును చూచెను. (ప్యారిసు ప్రభువును పట్టి విడక రోమియో చంపి తన జూలియటు కానుకనే నిచ్చియుండెను) వారిద్దరు కత్తి కత్తి దూసికొని జూలియటు కళేబరమునకు సమీపమునే పడిరి.

జూలియటుకు తెలివి వచ్చు సమయము వచ్చినది. లారెన్సు బంపిన వార్త రోమియోకు అందలేదని తెలిసి తానే జూలియటు కళేబరము వద్దకు వెళ్ళెను. అప్పుడే జూలియటు లేచెను. ఇంతలో ఎవ్వరి సందడియో విని లారెన్సు అచటినుండి వెడలెను. జూలియటు రోమియో చేతిలో కప్పు చూచెను. ఆ కప్పుతో ఏదో విషము త్రాగి మరణించెనని తెలిసికొనెను. ఆ కప్పులో ఇంకా కొద్దిగ విషమున్న తనుకూడా త్రాగవచ్చునని చూచెను. కాని అందు లేక పోయెను. వెంటనే సమీపమున నున్న ఒక ఖడ్గము తీసి దానితో తనను తానే పొడుచుకొని చంపుకొనెను. రోమియో ప్రక్కనే వ్రాలి మరణించెను.

ప్రేమజీవుల విపరీత గాధ!

మంటేగో ప్రభువు వంశము కాప్యులిట్ ప్రభువు వంశము ఈ వార్తలు విని చాలా దుఃఖించిరి. వారిని ఇది వరకు కన్నా ఒకరి నొకరు ఈ విషాద గాధకు కారకులని దూషించుకొనిరి. వారి వైరము మరింత పెరిగెను.

అప్పుడు లారెన్సు వారందరి సమక్షంలో రోమియో జూలియటుల ప్రేమగాధ వివాహము తెలిపెను. రెండు వంశముల వారును వారి బిడ్డలతో పాటు తమ వైరమును ముగించుటకు నిశ్చయించుకొని ప్రేమ పూర్వకముగ క్యాపులెటు ప్రభువు మంటేగు ప్రభువు కౌగలించుకొనిరి. తమ బిడ్డల జీవితములాహుతైన తరువాత వారు—కోడలి స్మారక చిహ్నముగా ఆమె విగ్రహము నొకదానిని బంగారుతో చేయించి వెరోనా పట్టణములో ప్రతిష్టింప చేసెను క్యాపులెటు తన అల్లుని విగ్రహము చేయించి ప్రతిష్టి చేసెను అంతటితో వారి వైరములు రూపుమాసెను.

కాని, పాపము రోమియో జూలియట్ల జీవితము అట్లు విషాదముగ ముగిసెనుగదా! ఆ ప్రేమజీవుల ప్రేమగాధ అమరగాధయై మనకందరికీ చిరస్మరణీయ మైనది.

(లేంబ్ షేక్సుపియరు కధకు అనువాదము) ప్రతినెలా సుప్రసిద్ధ ఆంగ్లరచయిత కధవిదైన అనువాద మిచ్చుట ప్రకటింప దలచాము)